# బైపాస్ సాములారు

శ్రీరమణ

పూర్వం ఊరికి దూరంగా వుండేది కాని బైపాస్ రోడ్డు పడ్డాక ఆశ్రమం అందిపుచ్చుకున్నట్టు అయింది. ఆశ్రమమూ అందులో స్వామివారూ వెలిసినప్పుడు అందరూ ''కొత్త సాములు'' అని పిలిచేవారు. ఇప్పుడు బైపాస్ సాములారుగా క్రమేపీ పాప్యులారిటీని పుంజుకుంటున్నారు. చెట్టు చేవ తేలడానికి, స్వాములు నిలదొక్కుకోడానికి అడ్డదారులు లేవు. కాలమే దానికి ఏకైక మార్గం. ఆయన మహిమలు కూడా కొన్ని లీక్ అయినాయి. కాని వాటిగురించి అతిగా ప్రచారాలు చెయ్యద్దనీ, మహిమల గురించి తెలిస్తే తాము దైవాంశ సంభూతులమని అందరికీ తెలిసిపోతుందనీ, తనలో దైవాంశ వుందనే సత్యం జన సామాన్యానికి తెలియడం వల్ల ప్రజలకు దూరం అవుతాననీ, అది తనకు చచ్చినా యిష్టం లేదనీ స్వామి హితభాషణం చేశారు. కాని భక్తులు ఆయన మాటల్ని పెడచెవిన పెట్టారు. బైపాస్‌స్వామి మృదువుగా కోప్పడి ''మనసెరిగి నడుచుకోండిరా'' అని మెత్తగా మందలించారు.

నాలుగైదు ఏళ్లలోనే ఆశ్రమం హంగులన్నీ ఏర్పాటు చేసుకుంది. భక్తులూ పెరిగారు. చిన వాసుదేవుడు శిష్యగణంలో సాములారికి ఆంతరంగికుడు. సందర్భ శుద్ధి వున్నవాడు. భక్తుల మనసుల్ని పసిగట్టి అప్పటికప్పుడు దానికి తగిన చిట్కా ప్రయోగించి, స్వామివారి ఇమేజిని యించీలించీలుగా పెంచగలవాడు. నలుగురిలో భక్తి ప్రపత్తులతో వొణికిపోతూ కనిపించినా, ఏకాంతంలో గురువుకి క్లాసు తీసుకుంటాడని ఒక వదంతి. ఆశ్రమం వెనకాలున్న బొప్పాయి చెట్టు ఆ ఏడాది విరగగాసింది. పిందెలుగా వుండగా తెగులు తగిలి, బొప్పాయిలు గిడసబారి చిన్నసైజు



శివలింగాలుగా ఆగిపోయాయి. ''అంతా గురువాజ్ఞ'' అని ముమ్మారు ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణం చేశాడు. తెగులిని దైవత్వంలోకి కన్వర్ట్ చేసి, ఒక్కో లింగాన్ని నూటపదహారు రూపాయలకు తక్కువ లేకుండా అమ్మి, సొమ్ము ఆశ్రమానికి జమచేయించాడు వాసుదేవుడు.

బంగారు పళ్లానికైనా గోడవార్పు తప్పదు. ఎంతటి వారైనా ఒక మంచి ఆసరా లేకపోతే అల్లుకుపోవడం కష్టం. పగలు భోజనాలు కాగానే, దూరప్రాంతాల భక్తులు రాసే విజ్ఞాపన ఉత్తరాలు చినవాసుదేవుడు చదువుతుంటే సాములారు సావధానంగా వినడం అలవాటు. కొన్నిటికి అప్పటికప్పుడే జవాబులు చెప్పేవారు. కొందరికి ఆశీస్సులు, కొందరికి శ్రీముఖాలు, కొందరికి అభయాలు తిరుగు టపాలో వెళ్లేవి. ఈ మధ్య భక్తులు రాసే జాబులలో స్వామివారి ఫోటో కావాలనీ, పూజలోకి అవసరమనీ, కనుక అనుగ్రహించాలనీ తెగ కోరుతున్నారు. దూరాభారాన వున్న ఆ భక్తుల వెర్రి అభిమానం స్వామివారి ముఖాన్ని ఎరుపెక్కించింది. ''దేనికైనా తరుణం రావలె'' అన్నారు గురూజీ. ''పోనీ ఒక ఫుటో కొట్టించి పంపితే పోలే'' అని చినవాసుదేవుడి మనసు అనుకుంది గాని పదిమందిలో ఏమంటాడు. మింగేసి వూరుకున్నాడు.


సరిగ్గా నాలుగో రోజున దీపదీపాల వేళ ఒక పెద్దమనిషి, ఒక బుడేగాడు పిలిచినట్టు ఆశ్రమానికి వచ్చారు. ఎవరు మీరు అన్నారు ఆశ్రమ వాసులు. ''మేము అవతల వూరు ఫుటో తీయడాన్కి పోతా వుంటే యిక్డ బస్ ఖరాబ్ అయింది'' అన్నాడు పెద్దాయన. గళ్ల పైజమా, గళ్ల చొక్కా, వెలిసిన మొహమల్ టోపీ, బుజం మీద కొయ్యపెట్టి చేతిలో యింకో పెట్టె వున్నాయి. పన్నెండేళ్ల బుడే మోకాళ్లు దిగిన లాల్చీ, బుజం మీద ముడిచిన మూడు కాళ్ల స్టాండు, దానితోపాటే గొడుగు వున్నాయి. బరువులన్నీ దించి పక్కగా నిలబడ్డారు. లోపల్నించి వస్తూనే చినవాసుదేవుడు ''గురువాజ్ఞ అయిందన్న మాట'' అన్నాడు భక్తజనాంతికంగా. జరిగిన సంఘటనకి దైవత్వం పులిమేశాడు. వాతావరణం గంభీరమైంది. ''ఈ నైట్ యిక్డ వుండీ పొద్దునే పోతాం'' అన్నాడు పెద్దాయన.

''దానికేం భాగ్యం'' అని వాసుదేవుడు అనుమతి యిచ్చి, వారికి వుండాల్సిన చోటు కూడా చూపించాడు.

వాళ్ల సామానంతా పక్కనే వున్న చిన్న పూరిగదిలో భద్రంగా పెట్టుకుని, బయట మెట్టుమీద కూచున్నారు ఫుటో వాళ్లిద్దరూ. మరి కాసేపటికి ఆగలేక పెద్దాయన బీడీ ముట్టించి యింకాస్త రిలాక్స్ అయాడు. ఇద్దరికీ ఆశ్రమంలో భోజనం ఏర్పాటు చేశారు. అవీ యివీ వడ్డిస్తూ, కాస్త చొరవ తీసుకుని ఫుటోవాళ్ల సమాచారమంతా రాబట్టాడు చినవాసుదేవుడు. కరీముల్లా ఫుటోగ్రాఫరు. బుడేగాడు ఆయనచేతి కింద ఆధరువు. పొరుగూళ్లో ఫుటో తీయడానికని పిలిపించారు. దారిలో బస్సు పాడైంది. పొద్దుగూకితే ఫుటో తీయడానికి ఎట్టి పరిస్థితిలోనూ వీలులేదు. వీళ్లని వెంటబెట్టుకు తీసుకు వచ్చినాయన వీళ్లకి చార్జీలు ఖర్చులు యిచ్చేసి తన దారిన తను వెళ్లిపోయాడు. ఎందుకంటే ఫుటో తీయాల్సిన శవాన్ని ఎట్టిపరిస్థితిలోనూ యీ సాయంత్రం తియ్యాలిట. రేపు మంగళవారం. ఇప్పటికే కష్టంమీద వుంచారట. అదీ సంగతి. ఆ ప్రోగ్రాం రద్దుకావడం, బస్సు సరిగ్గా యిక్కడే చెడిపోవడం యిదంతా గురువాజ్ఞ కాక మరేమిటనిపించింది వాసుదేవుడికి. వాళ్లకి భోజనం పెట్టి, పడకకి వసతి చూపించాడు. కరీముల్లాకి అక్కడ బాగా చనువు ఏర్పడింది. హాయిగా బీడీ మీద బీడి కాలుస్తూ చాలాసేపు చినవాసు దేవుడితో వ్యవహారం చేశాడు. రాత్రి పొద్దుపోయింది. ఆశ్రమంలో అందరి ముఖాలు వెలిగిపోతున్నాయి. వెలుగుకోసం నిరీక్షిస్తూ నిద్రలోకి జారారు.

ఆశ్రమం రోజూకంటే రెండు గంటలు ముందే మేల్కొన్నది. వెలిగించిన లాంతర్లు, బుడ్డిదీపాలు హడావిడిగా ఆశ్రమం నిండా ఆదుర్దాగా కదులుతున్నాయి. తెల్లారే సరికి సాములారికి శిరోముండనం చేయించి, మూడు నలుగులు పెట్టి భక్తులు ''విశేష స్నానం'' చేయించారు.

పండు నిప్పుల మీద గుప్పిళ్లతో సాంబ్రాణి వేసి, పొగతో సాములారినే కాదు ఆశ్రమాన్నే ముంచెత్తారు. అసలే వేకువ జాము ఆపైన దట్టంగా అలుముకున్న గుగ్గిలం పొగ- మాటలు తప్ప మనుషులు కనిపించడం లేదు. అంగరక్షలన్నీ భక్తిగా సాగిపోతున్నాయి. ఉత్తమజాతి ఉడుముకు



కూడా పట్టు దొరకనంత నున్నగా వుంది గురువుగారి గుండు.

తూరుపు తెలవారింది. బాలభానుని అరుణ కిరణాలలో కొత్తకాంతితో మెరిసిపోతున్న సాములారిని చూసుకుని భక్తులు తరించారు. అనంతరం ఆయనని శిష్యగణం పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. కొందరు సానల మీద గంధపు చెక్కలను అరగతీస్తున్నారు. విబూదిపళ్లను పన్నీటితో అరచేతులకు పట్టిస్తున్నారు ఇంకొందరు. రోజువారీ రుద్రాక్షలు మార్చి, పెద్దసైజు రుద్రాక్షమాల మెడలో వేశారు. పసుపు కుంకాలు సర్దేవారు కొందరు. ఇది ప్రోజులో ఎంతరాసినా పండదు. ఏ శ్రీనాధుడో అయితే అలదెనొకతె, పూచెనొకడు అంటూ రెండు సీసపద్యాలలో బొమ్మకట్టేవాడు. ఆ సీసాలు తెలుగు జాతిని సుసంపన్నం చేసేవి. పర్వదినాలకు తీసే పట్టుకాషాయం పంచెను తీసి కుచ్చెళ్లు పెట్టాడు చినవాసుదేవుడు. తన అధీనంలో వుండే ఉంగరాలను ఎనిమిది వేళ్లకూ తొడిగాడు. రెండు వేళ్లకు రెండేసి తొడిగి, తన బరువు వదిలించుకున్నాడు. ఆ కార్యక్రమాన్ని అక్కడ ఆపి, వాసుదేవుడు కరీముల్లాకి మేలుకొలుపు మొదలుపెట్టాడు. వాళ్లిద్దరినీ రెడీచేసి, వాళ్లకి టీ ఏర్పాటు చేయించాడు. బీడీ కాలుస్తూ, బుడే వెంట నడవగా ఆశ్రమమంతా కలయతిరిగాడు కరీముల్లా. ఆకాశం వంక రెండుసార్లు చూశాడు. ఆశ్రమం గోడవారగా స్పాట్ పెట్టాడు. బుడే కర్రపుల్లతో గిరిగీశాడు. వాసుదేవుడికి చెప్పాల్సినవి మూడు ముక్కల్లో చెప్పేసి వెళ్లిపోయాడు, వేపపుల్ల నవుల్తూ.

శిష్యులు బరిలోకి దిగి కరీముల్లా గీసిన గిరిలో పీటలు వేసి, దానిమీద జింకచర్మం పరిచారు. వెనకాల తులశికోటని అమర్చారు. సాములారి తల, జింకతల ఒక వరసలో వుండేట్లు సర్ది గురువుగారిని కూచోపెట్టారు. తులశికోట గూట్లో ప్రమిదని వెలిగించిపెట్టారు. పద్మాసనంలో కూచున్న గురువుగారి చేతిలో తావళం పెట్టారు. దండ కమండలాలు బాగా కనిపించేట్లు పెట్టారు. సరస్వతీ పీఠం మీద లావుపాటి పుస్తకం అమర్చారు. అవతల కరీముల్లా స్టాండుమీద కెమెరా బిగించి బుడేగాడి సాయంతో ఏర్పాట్లు చేసేస్తున్నాడు. ''స్వామీ! చేతులకు రెండు వరసలు రుద్రాక్ష మాలలు కట్టుకుంటాం'' అన్నాడొక భక్తుడు. ''యీ బాహ్యాడంబరాలు దేనికిరా'' అన్నట్టు చూస్తూనే స్వామి చేతులు అందించారు. భక్తులు ఆయన మనసెరిగి ప్రవర్తించుకున్నారు. హరివేణం, పంచపాత్ర అందులో ఉద్ధరిణ తెచ్చి జింకచర్మపు చుక్కల్లో కలిసిపోకుండా ఓ పక్కన పెట్టింది ఒక భక్తురాలు. కరీముల్లా కెమెరా అద్దంలోంచి మధ్య మధ్య చూస్తున్నాడు. రెండు మూడుసార్లు దగ్గరగా వచ్చిసాములారిని ఆయన ప్రమేయ ప్రయత్నాలు లేకుండానే కొంచెం వెనక్కి పక్కకి కదిలించాడు. అక్కడ సరస్వతీ పీఠం పక్కన వెలిగించిపెట్టిన నిలువు కుందితో బీడీ వెలిగించుకున్నప్పుడు మాత్రం కరీముల్లాని అందరూ అసహనంగా చూశారు. చినవాసుదేవుడు ''కంచెమీద కౌపీనం వేశాం...సహనమే మన ఆయుధం'' అని ఆశ్రమ వాసులకు వుపదేశం చేశాడు. కెమెరా దగ్గర్నించి రెండు అంగల్లో వచ్చి, కరీముల్లా అటు యిటూ చూసి, ఎర్రమట్టి నాలుగు వేళ్లకు వచ్చినంత తీసి కమండలంలో నీళ్లు వంచి కలుపుతున్నాడు. అందరూ ఏమిటో ఎందుకోనని సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ''సాములారి గుండు చూపించి నునుపు, నూనె ఎక్కువై మెరుస్తోంది. ఫుటో ఖరాబ్ అవుతది'' అన్నాడు.

''అయితే మట్టి రాస్తావా.. దిసీజ్ టూమచ్'' అని ఇంగ్లీషులో పళ్లు కొరికాడు ఒక రిటైర్డ్ తాసీల్దారు శిష్యుడు. అంతలో పరిస్థితిని అదుపులోకి తీసుకుని చినవాసుదేవుడు యింత పచ్చిగంధం తెచ్చి గుండుకి పులిమాడు. కరీముల్లా ''ఠీక్.. ఠీక్'' అని ''యీ చెంబూ, లక్డీ , చెక్కచెప్పుల్.. ఫుటోలో పడాల్నా'' అన్నాడు. ''అయ్యో! అవి సాములారి దండ కమండలాలు, పాంకోళ్లు... వారి శరీరంలో భాగాలు'' అని నెత్తినోరూ కొట్టుకున్నారు శిష్యులు.

''అయితే రఖ్‌దో'' అనుమతిచ్చాడు కరీముల్లా. నిండా నల్లగుడ్డ ముసుగు వేసుకుని ముల్లా చూస్తుంటే సాములారు తావళం తిప్పుతూ గొణగడం ప్రారంభించారు. ''అరెఛుప్'' అన్న కరీముల్లా కేకతో బొమ్మలా వుండిపోయారు. పద్మాసనంలో ఎడమకాలు కొంచెం కిందకి దిగాలన్న ఫుటోగ్రాఫర్ సూచనని భక్తులంతా మూకుమ్మడిగా అమలు చేశారు. టప్‌మని చిన్న చప్పుడు, ''...మ్మహాదేవ'' అని స్వామి భక్తిభారంతో పెట్టిన మూలుగు వినిపించాయి. చిట్లించిన నుదుటి విబూది పట్టెలు పెళ్లలుగా వూడిపడ్డాయి. అంతా నిశ్శబ్దం. కరీముల్లా ''రెడీ... ఏక్...ధో...తీన్'' అంటూ కెమెరా మూత తీసి మళ్లీ దాని మూతికి తగిలించాడు. అందరూ ఒక్కసారి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నారు. ''ఈ సందట్లో పడి దేముడి ధూపదీప నైవేద్యాల మాటే మర్చిపోయాం'' అన్నదొక అమాయకురాలు. ఇంతకంటె పూజ ఏముంటుంది, మన భ్రమేకాని'' అన్నాడు వాసుదేవుడు తనదైన శైలిలో. శిష్యుడి సమయస్ఫూర్తికి స్వామి కళ్లు చెమర్చాయి.

* * *

నాలుగోరోజున కరీముల్లా ఫుటోగ్రాఫులతో సహ ఆశ్రమానికి వచ్చాడు. అందరూ ఎదురు వెళ్లి ఆత్రుతగా చూశారు. ఏవేవి ఎట్లా పడ్డాయో, పడలేదో చూసి చర్చిస్తున్నారు. పసరుకట్టుతో పడకమీదున్న సాములారు ఒక మూలుగుతో తన వునికిని చాటారు. ''హేమైంది.. కాలూ ఖతమ్ హోగయా క్యా'' అన్నాడు. ''అబ్బే అదేం లేదు'' అన్నారొకరు. ''అదే ఆరోజు...'' అని ఒక భక్తురాలు నోరు తెరిచేసరికి చినవాసుదేవుడు కొదమసింహంలా ముందుకు దూకి ''అదే ఆరోజు స్వామివారి భక్తుడు సైకిల్‌కి అరటిగెల కట్టుకుని ఆశ్రమానికి వస్తుండగా... అది తోటలో మొదటికాపు గెలన్నమాట... బ్యాలెన్స్ తప్పి



రోడ్డువార మైలురాయి మీదపడ్డాడు. అతను ''గురూజీ'' అనడమూ, యీయన చటుక్కున ఆదెబ్బని లాగేసుకోవడమూ నువ్వు ఫుటో లాగినట్టుగా జరిగిపోయాయి. భక్తమల్లయ్య మామూలుగానే వున్నాడుగాని గురువుగారికి తప్పదు కదా'' అంటూ ఫొటో ప్రూఫులు పెద్దాయన చేతికి అందించాడు. ''పిడుగుల్ని చెట్లు లాగేసినట్టు భక్తుల దెబ్బల్ని గురువుగారు లాగేస్తారు'' అని కళ్లొత్తుకుంది ఒక శబరి సభక్తికంగా.

ఫొటోలు ఏ ఏ సైజుల్లో ఎన్నెన్ని కాపీలు కావాలో ఆర్డర్ చేశారు. కోరిన వారినీ, కోరని వారినీ కూడా స్వామి అనుగ్రహించి వి.పి.పి.లో ఫొటోలు పంపారు.

ఇది ఏభై ఏళ్లనాటి ముచ్చట. ఆయన శిష్యగణంలో వారైన మా తాతయ్య భక్తిపారవశ్యంతో చెప్పిన కథను నాకు తోచిన విధంగా నేను ఊహించుకున్నాను. నా అనువాద పాఠం యిది. మా పూజా మందిరంలో ఆనాటి ఫొటో యింకా వుంది. కాని రాంబాణం పురుగుల వల్ల, చిమటల వల్ల సాములారి కన్నొకటిన్నీ, అయిదారు పెద్ద రుద్రాక్షలూ మాయమైనాయి. అసలు అట్లాంటి సర్వసంగపరిత్యాగికి యిట్లాంటి వేడుకల మీద వ్యామోహం వుంటుందా, వుండచ్చా అని సందేహం వచ్చింది. ''త్యాగాలు త్యాగాలే ఫొటోలు ఫొటోలే'' అన్నాడు మా తాతయ్య.

పెద్దాయనతో వాదనకు దిగడం దేనికని, అప్పుడు టివిలో అన్నలు అడవి నేపథ్యంలో రెండు మూడు రకాల తుపాకులు అందుకుని మెడకు ధరించే అపురూప సన్నివేశాన్ని చూడడంలో మునిగిపోయాను. ■